వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 22 సెప్టెంబర్ 2024

## జిల్లా ఫుట్‌బాల్ ఎంపికకు శ్రీవేద విద్యార్థులు



మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :

జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు శ్రీవేద విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉపేంద్రరెడ్డి తెలిపారు. ఇటీవల శ్రీవేద పాఠశాలలో జరిగిన అండర్-17 ఫుట్‌బాల్ బాలబాలికల సెలక్షన్స్‌లో శ్రీవేద పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇందులో నలుగురు బాలికలు, ఇద్దరు బాలురు కలరన్నారు. పదవ తరగతి చదువుతున్న స్మార్తి, తన్మయ్, విజయ చైత్ర, ఇషిల్‌గౌడ్, త్రివేష్, సోషిల్‌లు ఎంపికయ్యారన్నారు. వీరు ఈనెల 28, 29, 30వ తేదీల్లో పల్నాడులోని పెనుకొండలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ లక్ష్మీనారాయణరెడ్డి, పీఈటి మహేంద్రలు అభినందించారు.

## సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

నందలూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గమ్మనేని రామకృష్ణ ప్రసాద్ దంపతులు శనివారం నందలూరు మండలం లోని ప్రసిద్ధిగాంచిన శ్రీ సౌమ్యనాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అనంతరం ఆలయం లోనికి ప్రవేశించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకి ఆలయ పూజారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీ సౌమ్యనాథ స్వామి యొక్క విశిష్టత గురించి రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ పసుపులేటి శశిశేఖర్ క్లుప్తంగా వివరించారు. ప్రధాన న్యాయమూర్తి తో పాటు విశ్రాంత న్యాయమూర్తి శ్రీదేవి, రాజంపేట సెకెండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శశిశేఖర్, నందలూరు కోర్టు మెజిస్ట్రేట్ భార్గవి నందలూరు కోర్టు సూపరింటెండెంట్ రమేష్,ఆలయ ఇన్స్పెక్టర్ దిలీప్, నందలూరు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

చిన్నమండెం, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :



జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఏ ఒక్కరు సమస్యలతో బాధపడకూడదనే ఉద్దేశంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దీంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలన్నీ ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేసి తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## నిరంతరం ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి భరోసానిచ్చారు. శనివారం ప్రొద్దుటూరు మండలం సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ రెడ్డి నగర్‌లో కూటమి ప్రభుత్వం పూర్తి చేసుకున్న 100రోజుల పాలనలో చేసిన మంచిని ప్రజలకు వివరించేందుకు ఏర్పాటుచేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి నగర్‌లో ప్రజల ఇళ్ల దగ్గరకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మేలును ఆయన వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన వంద రోజులలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీలను అమలు చేసిందన్నారు. ముఖ్యంగా ఏప్రిల్ నుండి జూన్ వరకు మొత్తం 7వేల రూపాయలు పింఛన్ల పంపిణీ చేశామన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేశామన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ విడుదల చేశారన్నారు. అలాగే నిరుపేదలకు ఆకలి తీర్చాలన్న సంకల్పంతో అన్నా క్యాంటీన్ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించామన్నారు. ఇటీవల విజయవాడలో వరద బీభత్సాన్ని తట్టుకొని ప్రజలకు అండగా నిలిచిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ దీపావళి నుండి ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇచ్చిన మరిన్ని హామీలను అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ వంద రోజుల పాలనలో సోములవారిపల్లె పంచాయతీకి రోడ్ల అభివృద్ధికి 50లక్షలు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఇవేకాకుండా ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా స్థానిక టిడిపి నాయకుల ద్వారా తన దృష్టికి తేవాలని ప్రతి ఒక్కరి సమస్య తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీఎస్ ముక్తియార్, ఈవి సుధాకర్ రెడ్డి, నంద్యాల రాఘవరెడ్డి, స్థానిక నాయకులు యాడికి రమేష్, ఎంఆర్పీఎస్ నాయకులు బాలయ్య, రెండవ వార్డు నాయకులు వరద నాగేశ్వర రావు, 5వ వార్డు నాయకులు ఎం.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హీ సేవ భారీ ర్యాలీ

దువ్వూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:




మండల కేంద్రమైన దువ్వూరులోని ఎంపీడీఓ కార్యాలయం నుండి దువ్వూరు బస్టాండ్‌లోని వై జంక్షన్ వరకు శనివారం స్వచ్ఛతా హీ సేవలో కార్యక్రమంలో బాగంగా అధికారులు, ప్రజలు బారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్బంగా సర్పంచ్ చంద్రాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో పచ్చదనం ఉండే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. అలాగే గ్రామంలో చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య కార్మికులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీఓ వసంతకుమార్, ఏఓ నాగేంద్ర బాబు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 4గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం

దువ్వూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



మండల పరిధిలోని 4 గ్రామాల్లో శనివారం మండల స్థాయి అధికారులు కలిసి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. నారాయణపల్లె, బయనపల్లె, కృష్ణంపల్లె, ఇడమడక గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఎంపీడీఓ శివప్రసాద్, ఏపీఓ వసంతకుమార్‌లు మాట్లాడుతూ వంద రోజుల కూటమి ప్రభుత్వంలో పెన్షన్ పెంపు, అన్నాకాంట్యీన్, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిటింగ్ యాక్ట్ రద్దు తదితర కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, సర్పంచ్‌లు నరసమ్మ, మండల టీడీపీ కన్వీనర్ బోరెడ్డి వెంకటరమణారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం

దువ్వూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కానగూడూరు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎలక్ట్రికల్ షాప్ దగ్ధం అయినట్లు బాధితుడు తెలిపారు. శనివారం మధ్యాహ్నం కానగూడూరుకు చెందిన షేక్ అబ్దుల్ ఎలక్ట్రికల్ దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో షాప్‌లో ఉన్న విద్యుత్ పరికరాలు అన్ని కాలిపోయాయి. సుమారు లక్ష 50వేల రూపాయల మేర విద్యుత్ పరికరాలు కాలి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. సంఘటన స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

## 5మంది జూదరులు అరెస్ట్

దువ్వూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

మండల పరిధిలోని మూడిళ్ల పల్లె గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న 5మందిని శనివారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 66,700రూపాయలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ముందుగా రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందిచే ఈ దాడులను నిర్వహించామన్నారు. గ్రామ సమీప పొలాల్లో 5మంది జూదం ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి నగదుతో పాటు పేక ముక్కలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## స్వచ్ఛత హి భారత్‌పై అవగాహన కార్యక్రమం




ఖాజీపేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

ఖాజీపేట గ్రామ పంచాయతీ నందు శనివారం స్వచ్ఛత హీ భారత్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శానిటేషన్ వర్కర్స్‌కు హెల్త్ చెకప్‌తో పాటు సబ్బులు, సామాగ్రి పంచాయతీ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి అందించారు. అనంతరం డ్వాక్ర మహిళలు, ఎన్జీవోస్‌లను సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛత హి కార్యక్రమంపై అవగాహణ కల్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి తమ శరీరంపై ఎలా శ్రద్ధ ఉంటుందో అలాగే తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రామ్మోహన్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వెలుగుసిబ్బంది పాల్గొన్నారు.

# 23న కలికిరికి మాజీ సీఎం రాక

కలికిరి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

రాష్ట్ర మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ నెల 23న సోమవారం హైదరాబాదు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గాన కలికిరికి చేరుకోనున్నట్లు మాజీ సీఎం వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. 23 నుంచి 28 వరకు కలికిరిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రజలకు అందుబాటులో ఉండి కలికిరి మండలంలో జరిగే కార్యక్రమాలకు హాజరవుతారన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు ఉచిత వైద్య శిబిరం

బద్వేలు, సెప్టెంబర్ 21 ( ప్రభాతవార్త):



పేదలకు ఉచితంగా వైద్యసేవలందించేందుకు ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బంది ఉచిత వైద్యశిబిరం ఏర్పాటుచేయడంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటువైద్యులు ఎందుకు బ్యానర్ కట్టి వారి పబ్లిసిటీకోసం వైద్యసేవలందిస్తున్నట్లు కనపడడం వెనుక ఆంతర్యమేమిటి? శనివారం బద్వేలు ప్రభుత్వఆసుపత్రిలో ఒక ప్రైవేటు వైద్యశాఖలకు చెందిన వైద్యులు సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి ప్రైవేటు వైద్య శాలకు సంబంధించిన మందులచీటి రాయడంపై పలు అనుమానాలు వస్తున్నాయి. అసలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా ప్రైవేటు వైద్యం చేయడం ఏమిటని పలువురు ప్రశ్నించడంతో ఆసుపత్రి సిబ్బంది అవాక్కయారు. మెడికల్ క్యాంపు నిర్వహించి పరీక్షలు చేయడం చూస్తుంటే ప్రభుత్వాసుపత్రిలో వైద్యులులేరా, ఆ పరీక్షలు నిర్వహించే సిబ్బంది, సామాగ్రి ఆసుపత్రిలో లేదా ఎందుకు ప్రైవేటు వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలోకి ఎందుకు ప్రవేశించారు. సూపరింటెండెంట్ ప్రైవేటు ఆసుపత్రి వారికి ఒత్తాసు పలికి క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రైవేటు ఆసుపత్రి ప్రచారానికి వేదికగా ప్రభుత్వాసుపత్రిని ఉపయోగించారని అందుకే ప్రైవేటు వైద్యులచే రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను వారి ఆసుపత్రిలో తెచ్చుకునేలా వారి మందుల చీటిలో రాసినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న పలువురు ప్రశ్నించి వీడియోలు తీయడంతో ఆ ప్రైవేటు వైద్యులు సిబ్బంది మెల్లగా అక్కడినుంచి జారుకున్నారు. సూపరింటెండెంట్ అత్యుత్సాహంతో నిర్వహించారని పలువురు చెబుతున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ.... మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ సిబ్బందికి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రైవేటు వైద్యులచే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టంగా తెలిపారు. 15 రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రి, మున్సిపల్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఈ క్యాంపును ఏర్పాటు చేశామని కేవలం మున్సిపాలిటీ సిబ్బందికోసమే ఈ వైద్య శిబిరమని తెలిపారు. రక్తపరీక్షలు ఎందుకు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో రక్తపరీక్షలు నిర్వహించేందుకు సిబ్బంది, పరికరాలు లేవా అని ప్రశ్నించగా నాకు కూడా తెలియదు నేను ఇప్పుడే క్యాంపుకు వెళ్లి వస్తున్నానని మాట దాటేశారు. ఈ విషయంపై కమిషనర్‌ను అడిగేందుకు ఫోన్ చేయగా తాను మీటింగ్‌లో ఉన్నానంటూ ఆ ప్రశ్నను దాటవేశారు. కానీ ఇక్కడ మున్సిపల్ సిబ్బంది కనపడలేదు గాని, బయటనుంచి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించినట్లు స్పష్టంగా కనపడుతోంది.

## లడ్డు ప్రసాదంపై సీబీఐ విచారణ జరిపించాలి

చాపాడు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

తిరుమల శ్రీవారి కల్తీ లడ్డుపై సీబీఐ విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంటరీ అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి ప్రసాదాలలో జంతువుల కొవ్వుతో అపవిత్రం చేసిన వ్యవహారం దారుణం అన్నారు. టిటిడి అధికార యంత్రాంగం గత ఐదు సంవత్సరాలలో అనుసరించిన రివర్స్ టెండరింగ్ విధానమే శ్రీవారి లడ్డు ప్రసాదాల నాణ్యత విషయంలో కొంపముంచిందని తెలిపారు. ప్రపంచ స్థాయి కలిగిన లాబరేటరీలో కల్తీ జరిగినట్లు గుర్తించినప్పటికి కూటమి ప్రభుత్వంపై వైకాపా నాయకులు తప్పుడు ఆరోపణలు మాట్లాడటం సరికాదన్నారు. కల్తీ వ్యవహారంలో సీబీఐ విచారణ జరిపి బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

## ప్రవక్త మహమ్మద్ అడుగుజాడల్లో ప్రతి ముస్లిం నడవాలి

కడప కార్పొరేషన్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అడుగుజాడల్లో ప్రతి ముస్లిం నడవాలని 28వ డివిజన్ టీడీపీ యువ నాయకుడు అబ్దుల్లా పేర్కొన్నారు. కడప నగరంలోని బుచ్చర వీధిలోని ఉర్దూ పాఠశాలలో మిలాదున్నబీ సందర్భంగా సిరతుల్ నబీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం విద్యార్థులకు ప్రవక్త జీవిత చరిత్ర గురించి వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రధాన కార్యక్రమానికి అబ్దుల్లా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు, ఉర్దూ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ నేటి యువత ముస్లిం సంప్రదాయాలు, ప్రవక్త సూచించిన మార్గాలపై నడిచి పుణ్య కార్యాలు చేయాలని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ దావూద్, ఉపాధ్యాయులు, అహ్మద్ బాషా, ఫకృద్దీన్, శివకుమార్, యాస్మిన్ సుల్తానా, భాగ్యలక్ష్మీ, శ్వేతారెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బంగారు, వెండి పతకాలను సాధించిన శ్రీ సాయి హైస్కూలు విద్యార్థులు

సిద్దవటం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:




సిద్దవటం శ్రీసాయి హైస్కూలు విద్యార్థులు టాటా బిల్డింగ్ ఇండియా (టాటా సాఫ్ట్‌వేర్ టీసీఎస్ సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసర రచన పోటీలలో పాల్గొని విజయ దుందుభి మోగించారు. దేశవ్యాప్తంగా విద్యార్థినీ విద్యార్థుల విద్యా నైపుణ్య సామర్థ్యాలను గుర్తించడానికి స్మార్ట్ ఇండియా నిర్మాణంలో యువత పాత్ర, ఇన్నోవేషన్, ఎంటర్ ప్రైన్యూర్‌షిప్, కమ్యూనిటీ సర్వీస్ లేదా పాలనలో పాల్గొనడం ద్వారా భారతదేశాన్ని స్మార్ట్‌ఆ మార్చడానికి యువత ఎలా దోహదపడుతుంది అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీ పరీక్షలలో సిద్దవటంలోని శ్రీసాయి హైస్కూలు విద్యార్థులు పతకాలను సాధించారు. ఈ పోటీలను టాటా సంస్థ ప్రతినిధులు అయేషా, ఫయీం, మల్లికార్జున నిర్వహించి పతకాలను సాధించిన వారికి బహుమతులను అందజేశారు. టాటా సంస్థ ప్రతినిధులు పాఠశాల ప్రిన్సిపల్ కొక్కంటి రేవతి దేవికి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పోలు వెంకట సుబ్బయ్య పథకాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను అభినందించారు.

## ఓపెన్ స్కూలు ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

ఓపెన్ స్కూలు నందు 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 28వ తేదీ వరకు అపరాధ రుసుము లేకుండా పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా ఓపెన్ స్కూలు కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు ఈనెల 29 మరియు 30వ తేదీలో రూ.200 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. ఓపెన్ స్కూలు కోఆర్డినేటర్‌లు ఈ విషయాన్ని విరివిగా ప్రచారం చేసి అందరూ ప్రవేశాలు పొందేలా ప్రయత్నించాలన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

చిన్నమండెం, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :




స్థానిక ఆదర్శ పాఠశాలలో శనివారం బాల్య వివాహాల నిషేదంపైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమేష్ మాట్లాడుతూ భారతదేశంలో వివాహం అనేది ఒక కొత్త తరానికి నాంది లాగా ఉండాలి, యువసంతతి ఆరోగ్యంగా, మానసిక వికాసానికి, దేశ అభ్యున్నతికి దోహదం చేస్తుందన్నారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే పరిణిత లేక మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తి కుటుంబ వ్యవస్థ చిన్నా భిన్నం అవుతుందని, దీని ద్వారా కొత్త తరం అనేక విపత్తుల పాలు అవుతాయని ఆయన తెలిపారు. సమత బాల్య వివాహ నిరోధ అవగాహన స్వచ్ఛంధ సంస్థ ప్రాజెక్టు అధికారి ఆశ్వని మాట్లాడుతూ సమత బాల్య వివాహ నిరోధ అవగాహన స్వచ్ఛంధ సంస్థ ద్వారా మన జిల్లాలో ప్రతి పాఠశాలలో వివాహ అర్హత వయసు లేని బాల్య వివాహాలను హెల్ప్‌లైన్ ద్వారా తమ దృష్టికి తీసుకరావాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఓలు నాగనవీన్, సుబ్బరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న విద్యార్థిని ఆదుకోండి

బద్వేలు, సెప్టెంబరు 21 ( ప్రభాతవార్త):



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యనభ్యసిస్తున్న లేఖన అనే విద్యార్థిని బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతోందని, దాతలు ముందుకు వచ్చి ఆమెను కాపాడాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్ కోరారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తగుంతపల్లెకు చెందిన పడిగ క్రిష్టఫర్, శిరీష దంపతుల కుమార్తె లేఖన బద్వేలులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తోందని, ఆమె తండ్రి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. బాలిక వైద్యం కోసం ఆటోను సైతం అమ్మి వైద్యం చేయించారన్నారు. సర్జరీకి అధిక మొత్తంలో అవసరమవుతుంది కావున దాతలు ముందుకు రావాలని ఇప్పటికే వైద్యఖర్చుల కోసం కొంతమొత్తంలో ఉపాధ్యాయుల నుండి బాలికకు అందజేయడం జరిగిందన్నారు. సహాయం చేయదలచిన వారు 8328469931నంబరుకు ఫోన్‌పే గాని, బద్వేలు స్టేట్ బ్యాంక్ యెయిన్ బ్రాంచ్ అకౌంట్ నెంబర్ 31519861473రు నంబరుకు గాని సహాయం అందించవచ్చన్నారు.

## పోలీసుల పేరుతో బంగారం చోరీకి పాల్పడిన నలుగురు దొంగలు

ముద్దనూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



బందులకుంట గ్రామానికి చెందిన మంగపట్నం పుల్లయ్య, మంగపట్నం వెంకట సుబ్బమ్మ సొంత పని నిమిత్తం కడపకు వెళ్లి తిరిగి శనివారం మధ్యాహ్నం ఉమ్మారెడ్డి పల్లె సర్కిల్ సమీపంలోని బందలకుంటకు వెళ్లే రహదారిలో నలుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి సినిమా ఫక్కీలో వారి వద్ద ఉన్న బంగారం చైను, ఉంగరంను దొంగలించుకుపోయిన ఘటన చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం నలుగురు వ్యక్తులు పోలీసులమని చెప్పి ద్విచక్ర వాహణంపై వెలుతున్న సమయంలో ఇలా బంగారు నగలు ధరించి వెళ్లకూడదని దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెబుతూ ఆ బంగారు నగలు తీసి చీర కొంగులో కట్టుకోమని చెబుతున్న సమయంలో ఆమె వద్ద నుంచి బంగారు నగలను దొంగలించుకుపోయినట్లు బాధితులు తెలిపారు. బాధితులు ఘటన జరిగిన వెంటనే ముద్దనూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటీన ఘటనా స్థలానికి సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌తోటి సిబ్బందితో వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై పోలీసులు సీసీటీవీల ఆధారంగా దొంగలను గుర్తించే పనిలో పోలీసులు పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. పోలీసుల ఎదుట తమకు న్యాయం చేయాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు విజయజ్యోతి అన్నారు. రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు తన వంద రోజుల పాలన జనరంజకమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చంద్రబాబు గత ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలలో వృద్ధాప్య పింఛను తప్ప ఏవీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంత విపత్తు జరిగితే భారత ప్రధాని పర్యటించకపోవడం విచాకర మన్నారు. తిరుమల లడ్డు అంశాన్ని తెరపైకి తెచ్చి రాజకీయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్‌కుమార్, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, మాజీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు శ్యామలమ్మ పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాల పవిత్రతను కాపాడండి

కడప వైద్యవిభాగం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

పవిత్రమైన పుణ్యక్షేత్రాలను, దేవాలయాల పవిత్రను కాపాడాలి కానీ రాజకీయ కోణంలో చూడకూడదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు విజయానందంరెడ్డి పేర్కొన్నారు. కడపలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడారని సాక్షాత్తు ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆరోపించడం చూస్తే తిరుపతికి రాజకీయ రంగులు అంటగట్టే ప్రయత్నంలో ఉన్నారన్నారు. ఈ ప్రభుత్వం భక్తులకు దేవుడి దర్శనం కల్పించకుండా రాజకీయ కోణం తీసుకురావడం సరైంది కాదన్నారు.

## కొటాలలో ఇది మంచి ప్రభుత్వం విజయవంతం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



గత వైకాపా అవినీతి పాలనకు పాతరేసి ప్రజలు టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ఈ మంచి ప్రభుత్వాన్ని ప్రజలు మనసారా ఆశీర్వదించాలన తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కోరారు. శనివారం తంబళ్లపల్లె మండలం కొటాలలో ఆయనకు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున ఘనస్వాగతం పలికారు. ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఘన విజయం సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడు, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవో త్యాగరాజు, ఈఓఆర్డీ దిలీప్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, టీడీపీ రాజంపేట ఎపార్లమెంటు ఉపాధ్యక్షుడు కొటాల శివకుమార్, రాష్ట్ర బీసీ టీడీపీ ఉపాధ్యక్షుడు తులసీధర్ నాయుడు,మహిళా నాయకురాలు సిద్దమ్మ, కొటాల సుధాకర్, అల్లావుద్దీన్, కృష్ణమూర్తి నాయుడు, బేరీ శ్రీనివాసులు, పురుషోత్తం, సామిరెడ్డి, రామచంద్ర, సోమశేఖర్, ధనశేఖర్, నరసింహులు, రామాంజులు, కాలా నారాయణ, చిన్న రెడ్డప్ప, జయరాంరెడ్డి, రామలింగారెడ్డి, నాయకులు, ప్రజలు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## ఇంటి స్థలాల కోసం సీపీఐ భూ పోరాటం

తంబళ్లపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



తంబళ్లపల్లె మండలం కొట్లపల్లి గ్రామం సర్వే నెంబర్ 27/2 ఏబీలో 4 ఎకరాల భూమిలో సామాన్య దళిత వ్యవసాయ కూలీలకు ఇంటి స్థలాలు కొరకు సీపీఐ నియోజకవర్గ నాయకుడు అంజన్న ఆధ్వర్యంలో భూ పోరాటానికి నాంది పలికారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపు కృష్ణప్ప, భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అన్నమయ్య జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఈ భూ పోరాటాన్ని ప్రారంభించారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో వేలాది ఎకరాలు అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని ఆ భూములను దళితులు, వెనకబడిన వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని లేదంటే ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుధీర్‌కుమార్, వెంకట స్వామి, జయశేఖర్, ఉత్తన్న, మంత్రాల రమణ, కున్నప్ప, లక్ష్మీదేవి, శివ, రామ్మోహన్, మల్లికార్జున, సంజీవమ్మ, జయలక్ష్మి, రామానాయుడు, రాధాకృష్ణ, చిన్నికృష్ణ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

సిద్దవటం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం ఎస్.రాజంపేటలో శనివారం సమ్మిళిత విద్యా అసిస్టెంట్ కోఆర్డినేటర్ రమణమూర్తి ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఇంటి వద్దనే విద్యా కార్యక్రమాన్ని ఉపాధ్యాయుల పనితీరును ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం ఇంటి వద్దనే విద్యలో భాగంగా ఎస్.రాజంపేటలో పర్యవేక్షణ చేశామని ప్రత్యేక అవసరాలు గల పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతి బుధవారం భవిత సెంటర్‌లో జరిగే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అలాగే ప్రభుత్వం వీరికి ఎస్కార్ట్ ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌లను ఉపకరణాలకు అందిస్తుంది. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పద్మావతి పాల్గొన్నారు.

## ప్రజారంజక పాలన కూటమి ప్రభుత్వం

సిద్దవటం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



సిద్దవటం మండలం పెద్దపల్లి గ్రామ పంచాయతీ గాంధీ శనివారం కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తెదేపా రాజంపేట పార్లమెంటు ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య మాట్లాడుతూ మా కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని ప్రజా రంజక పాలన అందించే పరిపాలన మా రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు సుపరిపాలన అందిస్తున్నారని వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా మట్టి మాఫియా ల్యాండ్ ట్రైపింగ్ మాఫియాలతో వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారని గత ఐదు 5 సంవత్సరాల్లో మీ ప్రభుత్వం అధికారంలో ఉండగా మా కార్యకర్తలను ఎన్నో ప్రలోభాలు పెట్టినా అదరకుండా బెదరకుండా పార్టీ కోసం కృషి చేశారని మీ ప్రభుత్వం అధికారంలో పోయాక వైసీపీ నాయకులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు నోరు పారేసఉకోకుండా ఉండాలని ఆయన అన్నారు. మా ఆడపడుచులకు ఉచితంగా బస్సులో ప్రయాణం చేసేందుకు అన్ని ఏర్పాట్లు మా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

## వంద రోజుల్లో ప్రజా ప్రభుత్వం

సిద్దవటం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

సిద్దవటం మండల హెడ్ క్వార్టర్ గ్రామ సచివాలయంలో గ్రామ మహిళా సర్పంచ్ భవనాసి నాగరాణి అధ్యక్షతన శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వంద రోజుల పాలనలో ప్రజలకు ఎన్నో మంచి కార్యక్రమాలు చేసిందని రాష్ట్ర ప్రభఉత్వ ఉద్యోగులకు, టీచర్లకు జీతాలు 1న జమ అయ్యే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం సంతోషకర మన్నారు. రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిరంతరం ప్రజా సమస్యలపై కష్టపడుతూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బంది పడ్డారని సర్పంచులకు గౌరవం లేకుండా చేసిన ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. జనసేన మండల అధ్యక్షుడు రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలన ఒక పండగ లాంటిదని రాష్ట్రంలో మహా యజ్ఞం జరుగుతుందని చెప్పినా వాగ్దానం ప్రకారం వృద్ధులకు, వికలాంగులకు పింఛను రెట్టింపు చేసిన ఘనత మా ప్రభుత్వానికి తగ్గుతుందన్నారు. ప్రజలకు తెలియజేసేందుకు గడప గడప తిరుగుతున్నామని ఆయన అన్నారు.

## వేతనాలు పెంచి మమ్ములను ఆదుకోండి

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లి మండలం మంగంపేట పంచాయతీలో ఉన్న ఏపీఎండీసీ మోడల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగులకు సిబ్బందికి వేతనాలు పెంచి మా జీవితాలలో వెలుగు నింపాలని చాలీ చాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆసుపత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత పది సంవత్సరా లుగా పనిచేస్తున్నప్పటికీ మాకు ఎటువంటి లైఫ్ సెక్యూరిటీ లేదని అలాగే గతంలో ఎండీ ఏపీఎండీసీ సంస్థలో విలీనం చేసి నేరుగా వేతనాలు ఇచ్చే విధంగా చొరవ చూపుతామన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఏపీఎండీసీ ఎండీ దయ తలచి మాకు వేతనాలు పెంచే విధంగా చొరవ చూపాలని కోరుతున్నామని సిబ్బంది తెలిపారు.

## స్వచ్ఛతాహి సేవా అవగాహన ర్యాలీ విజయవంతం

కలికిరి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఎ.రెడ్డిరామ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమం విజయవంతమైంది. సచివాలయంలో స్వయం సహాయక సంఘం గ్రూపు సభ్యులు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం స్వయం సహాయక సంఘం సభ్యులతో ర్యాలీ నిర్వహించి మానవ హారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రెడ్డిరామ్, సీసీ ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, టీడీపీ సీనియర్ నేత వెంకటపతి, సచివాలయ సిబ్బంది, సంఘ మిత్రలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దోమతెరలు తప్పనిసరిగా వాడాలి

వేంపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



దోమల నియంత్రణకు దోమతెరలు తప్పనిసరిగా వాడాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య కోరారు. శనివారం వేంపల్లె మండలంలోని ముతుకూరులో ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడుసార్లు ల్యాబ్‌కు అందించాలని ఆదేశించారు. సర్పంచి గంగులయ్య, వైద్య సిబ్బంది మాలతి, లింగారెడ్డి, లక్ష్మిదేవి, ఆశ, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆహారవిజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ అన్నారు. స్వచ్ఛాతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పచ్చదనం, పరిశుభ్రతలో ఐదో రోజైన శనివారం కళాశాలలో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. రెండు ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థి వాలంటీర్లు కళాశాలలో విద్యార్థులు పెంచుతున్న నేరేడు మొక్కల తోటలో, కళాశాల పరిసరాలలో కలుపు మొక్కలు తీసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, అధ్యాపకులు డాక్టర్ సాయిశ్రీనివాస్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జాకీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

## లోపట్నూతలలో ఇది మంచి ప్రభుత్వం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



లింగాల మండలంలోని లోపట్నూతలలో శనివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పాల్గొని 100రోజులలో ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి వివరించారు. సామాజిక పింఛన్లను పెంచి పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఔదార్యం

పులివెందుల, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్1, 2 ఆధ్వర్యంలో వాలంటీర్లు విరాళాలు సేకరించారు. వీటిని యోగివేమన యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటరు, అసోసియేషన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డిలు ఈ కళాశాల వాలంటీర్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుధీర, డాక్టర్ సి.బాలనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ యు.శ్రీనిత, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడడంలో వైసీపీ విఫలం

బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 21 ( ప్రభాతవార్త):



తిరుమల పవిత్రతను కాపాడడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రతిరోజూ తిరుమలకు వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకునేందుకు ఎంతోమంది వస్తుంటారని, వచ్చిన ప్రతి ఒక్కరూ లడ్డు ప్రసాదం కొనుగోలు చేస్తారన్నారు. అలాంటి లడ్డూ ప్రసాదంలో జంతువుల అవశేషాలు కలిగిన నెయ్యిని వాడడం హిందువుల మనోభావాలు దెబ్బతీయడమే నన్నారు. ఈ సంఘటనతో ప్రతి భక్తుడు మనో వేదనకు గురవుతున్నారని ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఆధ్వర్యంలో తిరుమల పవిత్రతను కాపాడే అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన కోరారు.

## నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎన్నికైన రత్నం విద్యార్థులు

బద్వేలు అర్బన్, సెప్టెంబర్ 21 ( ప్రభాతవార్త):



పట్టణంలోని జిలా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన మండలస్థాయి ఆటల పోటీలలో రత్నం పాఠశాలకు చెందిన నలుగు విద్యార్థులు తౌహిద్, రోహిత్, యూనస్ లు ఖోఖో ఆటకు గాను, మరియు మణికుమార్ అనే వి ద్యార్థి వాలిబాల్ ఆటకు, సాదక్ కబడ్డీ ఆటకు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎన్నికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రత్నం తెలిపారు. ఈ విద్యార్థులు ముమ్ముందు మరింతగా క్రీడలలో రాణించి పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

## సంక్షోభంలో సంక్షేమాన్ని అందించే ఏకైక నాయకుడు

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం వంద రోజుల సువర్ణ పాలన పూర్తయిందని శనివారం ఓబులవారిపల్లి మండలం ముక్కవారిపల్లి పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇన్‌ఛార్జి ముక్కారూపానందరెడ్డి, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. దేశంలో అభివృద్ధికి చిరునామాగా ఏపీ మారడం సువర్ణ పాలనకు నిదర్శనమని ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, విజయవాడలో వచ్చిన వరదల్లో అహర్నిశలు రాత్రి పగలు పర్యవేక్షించి ప్రజల్లో ఉన్న సీఎం నారా చంద్రబాబనాయుడు, డిప్యూటీ సీఎం పవ్ కల్యాణ్ ఆదర్శగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలు శాఖాధికారులు, ఎన్డీఏ కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఆవులకు ముద్ద ఛర్మవ్యాధులపై యజమానులు అవగాహన పెంచుకోవాలి

రామాపురం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



ప్రస్తుత సీజన్‌లో ఆవులకు ముద్ద ఛర్మ వ్యాధులు వస్తున్నాయని ఆవుల యజమానులు ముందు జాగ్రత్తగా అవగాహన పెంచుకోవాలని పశువైద్యాధికారి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ, కొత్త రోడ్డు నారాయణపురం సమీపంలో ఉన్న రైతు శ్రీమన్నారాయణ మరియు గొల్లపల్లికి చెందిన రైతు రాజు గ్రామాల్లో పశువైద్యాధికారి సిబ్బందితో వెళ్లి పశువుల వ్యాధులపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. అత్యవసరంగా ఏదైనా పశువులకు వ్యాధి సోకిందంటే 1962 అంబులెన్స్‌కు సమాచారం ఇస్తే వెంటనే వాహనం తమ గ్రామానికి వచ్చి పశువులను కాపాడుకోవచ్చన్నారు. ప్రస్తుతం కొన్ని మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, మిగిలినవి కూడా గ్రామాల్లో తమ సిబ్బంది యాక్షన్ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పశువుల యజమాని రైతు రేఖం నారాయణ, రాజు, శీను, సత్యమయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు వందనం

మైదుకూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



మైదుకూరు మండలంలోని శిశ్వనాధపురం పంచాయతీలో వాటర్ పైప్ లైన్ లీకేజ్ గుంతపై వార్త రాయడంతో స్పందించిన పంచాయతీ సెక్రటెరీ కూశెట్టి శ్రీనివాసులు వెంటనే స్పందించి లీకేజీ సమస్యను పరిష్కరిస్తూ స్థానికులకు ఏలాంటి ఇబ్బందులు జరగకుండా వాటర్ పైపులను గుంతను జేసీబీ సహాయంతో శనివారం పూడ్చడం జరిగింది ఈ విషయాన్ని వార్త విలేఖరికి తెలియజేశారు.

## మహా ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపిన వారిని కఠినంగా శిక్షించాలి

రామాపురం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



కలియుగ దైవమైన వేంకటేశ్వర స్వామి మహా ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపినట్లు వస్తున్న వదంతుల దృష్ట్యా ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ వారు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక హరిహరాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ చేసిన లడ్డు ప్రసాదంలో ఆవు పంది కొవ్వులు తయారు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అలాగే ఈ కలియుగంలో బ్రహ్మాండ నాయకుడు అయినటువంటి శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదం కల్తీ రావడం చాలా బాధాకరమన్నారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం చర్యలు తీసుకొని శిక్షించాలని అన్నమయ్య జిల్లా బజరంగదల్ సంయోజక్ కొప్పూరు వీరారెడ్డి డిమాండ్ చేశారు. ఇలాంటి విషయాలపై విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లె అధ్యక్షులు ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి దామోధర్ నాయుడు విశ్వహిందూ పరిషత్ మండల అర్చక పురోహిత్ ప్రముఖ నాగరాజులు డిమాండ్ చేశారు.

## ప్రజల మన్ననలు పొందిన ప్రజా ప్రభుత్వం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు లోనే ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని రాజంపేట డాక్టర్ల సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ఎండీసిపి నాయక్ అన్నారు. ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రజా వేదిక కార్యక్రమంలో భాగంగా లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్డు కూడలి నందు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ప్రకృతి వైపరీత్యాలతో ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలన సాగించిందన్నారు. కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఇది మన ప్రభుత్వం స్టిక్కర్ లను అందించి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, చేయవలసిన సంక్షేమ అభివృద్ధి పథకాలు వివరాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కొండూరు వెంకటరామరాజు, అహ్మద్, కావలి ఆంజనేయులు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది రఫీ పవన్ కుమార్ సాయి తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు వాహనాలు ఢీ

### - ఒకరు మృతి, ఆరుగురికి గాయాలు

సంబేపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి-కలకడ మధ్య శనివారం మూడు వాహనాలు అదుపు తప్పి ఒకదానిని ఒకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జాఫర్(66) మృతి చెందాడు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్సై భక్తవత్సలం, కలకడ ఎస్సై, సంబేపల్లె ఎస్సై తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సంక్షోభంలోనూ సంక్షేమం 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం

మైదుకూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



మైదుకూరు మండలంలోని శివపురం పంచాయతీలో సంక్షోభంలోనూ సంక్షేమం 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమంలో గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి అధికారులు శివపురం పంచాయతీ సర్పంచ్ ప్రజలకు అవ్వతాతల పింఛను, అన్న క్యాంటీన్, మెగా డిఎస్సి, వరదల్లో చంద్రబాబు చేసిన పనులు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, ధ్యానం కొనుగోలు బకాయిలు చెల్లింపు, ఇక మీదట కూడా ప్రజల ఆకాంక్షలకు అవసరాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రజలకు తెలయజేయడమే కాకుండా స్థానిక సమస్యలను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు ప్రజలకు తెలియజేశారు. అంతేకాకుండా శివపురం సచివాలయంలో అధికారులు, సర్పంచ్ మొక్కలు నాటి వాటి సంరక్షణ తీసుకుంటూ మొక్కలు మానవళి మనగడకు మూలాశారులు అని ప్రకృతిని మనం కాపాడుకోవాలని గ్రామంలో ప్రతి ఒక్కరు పరిశుభ్రతపై జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి ఎమ్మార్వో విజరాజసింహ నరేంద్ర, ఎంపీడీవో,పి లక్ష్మీదేవి. ఈవో పి ఆర్ టి సుధాకర్, శివపురం సర్పంచ్ భాస్కర్ రెడ్డి, సుబ్బారెడ్డి తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామానికి సిమెంటు రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ కాలువలు

సంబేపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంటు రోడ్డు, తాగునీరు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సంబేపల్లె మండలంలోని సంబేపల్లె నుంచి బొగ్గులవారిపల్లి, అక్కడి నుంచి అంబేద్కర్ వరకు కోటి రూపాయలతో మంజూరైన సిమెంటు రోడ్డు పనులను రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మంత్రిని పూలమాలతో ఘన స్వాగతం పలికారు.



Additional District Court - Cum - Special Court for trail of Cases relating to Redsanders Smuggling, A.P., Tirupathi

ప్రకటించబడిన నేరస్థుని ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయడం ఏమనగా! మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్, క్రైం నెం. 173/2016 U/S 307, 332, 353, 379, r/w 34 ఐ.పి.సి. సెక్షన్ 20 (i) (c) (iii) (iv) (vi) (x) Forest Act in S.C. No.85/2022 అను ముద్దాయి ఎ3 షేక్ ఖాదర్ బాషా, వయస్సు 26, తండ్రి షఫీ సాహెబ్, అమీర్ థియేటర్, సలాం వీధి, కడప టౌన్ అను వ్యక్తి పై కేసులో ముద్దాయిగా ఉండి, కోర్టుకు హాజరు కానందున రాజశ్రీ పై కోర్టు వారు అతనిపై నాన్ బెయిలబుల్ వారంటు జారీ చేసినారు. సదరు ముద్దాయిని ప్రకటించబడిన నేరస్థునిగా ప్రకటించినారు. సదరు కేసు వాయిదా 24.10.2024వ తేదీన పై కోర్టు నందు ఉన్నది. సదరు ముద్దాయి ఆచూకీ తెలిసిన వారు మైదుకూరు సి.ఐ. సెల్ : 9121100618, 9121100619, ల్యాండ్‌లైన్ నెం.08564-2312338 సమాచారం తెలుపుదురని కోరుతున్నారు.

సం/- Inspector of Police, Mydukur (U/G) P.S., YSR Kadapa Dist.

## ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

**మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వందరోజులు పూర్తియిన సందర్బంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్‌హాలులో చేపట్టారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పెన్షన్‌దారులకు చెప్పిన విధంగా రూ.1000లు పెంచి రూ.4వేలు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా పేదలకు అన్న క్యాంటిన్‌కూడా ప్రారంభించామన్నారు. అక్టోబర్, నవంబర్ నెలలో మహిళలకు ఉచిత బస్సు, ఉచిత సిలిండర్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. చెత్తపై విధించిన పన్నును కూడా రద్దుచేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్ని ముఖ్యమంత్రి నెరవేర్చుతారన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబందిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారంకు చర్యలు చేపట్టారు. అనంతరం ప్రభుత్వం వందరోజుల పాలనపై ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి ఇది మంచి ప్రభుత్వం అన్న పోస్టర్లను అంటించారు. కరపత్రాల ద్వారా ప్రభుత్వం చేపడుతున్న పనుల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ ప్రమీల, తహశీల్దార్ ఖాజాబి, ఎంపిడిఓ భానుప్రసాద్, టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్, గుర్రప్పనాయుడు, నాదేళ్ళ విద్యాసాగర్, కౌన్సిలర్ గాంధీ, రాధ, జేసిబి మధు, పులిమహాలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా గురజాడ జయంతి

**మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం గురజాడ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ గోపతి బాలక్రిష్ణ మూర్తి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ భావాజాలంతో సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహనీయులలో గురజాడ అగ్రస్థానంలో ఉంటారన్నారు. గురజాడ 162వ జయంతి సందర్బంగా తెలుగుభాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డాక్టర్ తాలంవేడు సాయిశంకర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌లో ఘనంగా ప్రపంచ అల్జీమర్స్‌డే

**మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో శనివారం ప్రపంచ అల్జీమర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చంద్రశేఖర్ అనిస్టేట్, డాక్టర్ ఉషా ఈఎన్‌టిస్పెషలిస్టు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అల్జీమర్స్ వ్యాధి నాలుగు దశల్లో ఉంటుందని, అల్జీమర్స్ వ్యాధిలో మెదడు దెబ్బతినడం ప్రారంభ అవుతాయన్నారు. 65ఏళ్ళ పైబడిన వారిలో కనిపించే వ్యాధి అని జ్ఞాపకశక్తి మందగించడం దీని ముఖ్యలక్షణమన్నారు. ఈవ్యాధితో వ్యక్తిత్వ మార్పులకు గురవుతారని వారు తెలిపారు. శారీరకంగా, మానసికంగా తగ్గించుకోవడానికి వ్యాయామం ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ గీతా, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వామిజీని కలసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

**మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



శ్రీశ్రీదత్తా విజయానంద తీర్థ స్వామిజీని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కలిశారు. ఆయన తిరుమలకు వెలుతున్న సందర్బంగా మార్గమధ్యంలో ఎమ్మెల్యే స్వామీజిని కలిసి శాలువ కప్పి సన్మానించారు. అనంతరం స్వామిజీ ఆశీర్వాదాన్ని పొందారు. ఎమ్మెల్యేతోపాటు విజయభారతిస్కూల్ కరస్పాండెంట్ సేతు కలిశారు. అనంతరం స్వామిజి భారతి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గెవితిమ్మరాయస్వామి ఆలయంలో పూజలు

**రామసముద్రం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



మండలంలోని దిన్నెపల్లె సమీపంలో కొండపై వెలసిన తిమ్మరాయస్వామి ఆలయంలోన ప్రధాన అర్చకులు కులశేఖర్ బట్టర్ స్వామికి ఆలయం శుద్ది ఉదయం పలు రకాల పుష్పాలతో అలంకరణ చేసి అర్చనలు అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం కావడంతోన గోవిందా, గోవిందా అంటూ నామ్మస్మరణలతో మారిమ్రోగిన గెవితిమ్మరాయస్వామిని దర్శించుకొన్నారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

## తిరుమలరెడ్డిపల్లెలో స్వచ్చత హీ సేవా కార్యక్రమం

**రామసముద్రం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలంలోని పెద్దకురపల్లె గ్రామ పంచాయితీలోని తిరుమల రెడ్డిపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వచ్చత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్పనాయుడు, సెక్రటరీ భానుమూర్తి, ఛైర్మెన్ క్రిష్ణప్ప, హెచ్‌ఎం మోహన్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. స్వచ్చతహి సేవా కార్యక్రమం ప్రాముఖ్యతను విద్యార్థులకు విరవించారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్పనాయుడు, భానుమూర్తి, క్రిష్ణప్ప, మోహన్ నాయక్, హరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని బ్రష్టు పట్టిస్తున్నారు : బిజెపి నాయకులు

**రామసముద్రం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



తిరుమల లడ్డూ తయారీలో కల్తీనెయ్యి ఉపయోగించడం హిందూ ధర్మాన్ని అవమానించడే కాక చట్టరిత్యా నేరం అందుకు నిరసనగా శనివారం మద్యాహ్నం చెంబకూరులో హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ తిరుమల లడ్డూలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఇంజం ఆనంద్ కుమార్ నాయుడు, క్రిష్ణమూర్తి, శ్రీనివాస, మోదీ రామ్మూర్తి, రంగాని వెంకటేష్, శీన, రమేష్, గుర్రప్పు, గంగాధర్,టైలర్ మణి, వెంకటరమణ, లక్ష్మన్న, మేస్త్రీ కిట్టన్న, తదితరులు పాల్గొన్నారు.

## బిటెక్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రతిభ

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



జేఎన్‌టియు 2024 నిర్వహించిన బిటెక్ మూడవ సంవత్సరం సెకండ్ సెమిస్ట్రీ ఫలితాల్లో విశ్వం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమణారెడ్డి తెలిపారు. సిఎస్ఈకి చెందిన స్వప్న, యామిని, సభా, భాను, ఈసిఈకి చెందిన నిరోష, లావణ్య, గీత, హిమజ, సివిల్‌లో బాలాజి, మెకానికల్‌లో చందు అనే విద్యార్థులు 76.45శాతం మార్కులు సాధించారని ఆయన తెలిపారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులను కళాశాల ఛైర్మెన్ ఎం.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

## మిట్స్‌లో ఎన్‌సిసి సెలక్షన్స్

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఎన్‌సిసి సెలక్షన్స్ బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌లో వందమంది విద్యార్థులకు పైగా పాల్గొనగా దేహదారుడ్య పరీక్షలు, పరుగుపందాలు నిర్వహించారు. ఇందులుఒ 47మంది విద్యార్థులను ఎంపిక చేయగా 20మంది బాలికలు, 27మంది బాలురులను ఎంపిక చేశా రు. చిత్తూరుకు చెందిన 35వ ఆంధ్రా బెటాలియన్ సుబేదార్, మేజర్ రాకేష్‌లాల్, సతీష్‌ల ఆధ్వర్యంలో ఈ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ అధికారి నవీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## సర్టిఫికెట్స్ కోర్సు ఆన్‌లైన్ పరీక్షలు

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ ప్రోగ్రామం అన్ టెక్నాలజి ఎనహాన్స్‌డు లర్నింగ్, ఇండియన్ ఇనిస్యూట్‌ఆప్ టెక్నాలజీ మద్రాస్ స్వయం అనే పేరుతో నిర్వహించిన సర్టిఫికెట్స్ కోర్సులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 645మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించన వారికి ఎంపిటిఈఎల్ వారు సర్టిఫికెట్లు అందజేస్తారని ఆయన తెలిపారు.

## అంగళ్ళులో స్వచ్చత హి కార్యక్రమం

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



అంగళ్ళులో స్వచ్చత హి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా అంగళ్ళు గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు, పరిసరాల పరిశుభ్రత పాటించాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హరినారాయణ, హౌసింగ్ డిఈ వెంకటరెడ్డి, వెలుగు ఏపిఎం నీరజ, గ్రామ సెక్రటరీ నవాజ్, టిడిపి నాయకులు వైజి.సురేంద్ర, సూరి, బొగ్గుభాస్కర్, మనోజ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సంక్షోభంలో సంక్షేమమే ధ్యేయం

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నప్పటికి సిఎం చంద్రబాబునాయుడు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని రాజంపేట పార్లమెంటరీ బిసిసెల్ అధ్యక్షులు సురేంద్రయాదవ్ అన్నారు. శనివారం కూటమి ప్రభుత్వం వందరోజుల పాలన కార్యక్రమంపై అంగళ్ళు గ్రామ పంచాయితీ ఆవరణంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్బంగా ఎన్నికల మెన్ఫేస్టులో ఇచ్చిన హామీల మేరకు మెగా డీఎస్‌సి, పింఛన్ల పెంపు, రైతులకు దాన్యం సేకరణ నిధులు, వరదల్లో బాధితులకు ఆసరా, ల్యాండ్‌టైటల్ రద్దు అమలు చేశారని ఆయన తెలిపారు. ఈ పథకాల గురించి ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వైజి.సురేంద్ర, సూరి, కుళ్ళాయప్ప, ఎంపిడిఓ హరినారాయణ, డిఈ వెంకటరెడ్డి, వెలుగు ఏపిఎం నీరజ, గ్రామ సెక్రటరీ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో శాంతి సౌభ్రాతృత్వంతో మెలగాలి

**మదనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



సమాజంలో శాంతి సౌభ్రాతత్వంతో మెలగాలని బిటి కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్, యుఆర్‌ఐ సభ్యులు మునిరత్నం అన్నారు. శనివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవం, స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రాం హెల్త్ ఇండియా కార్యక్రమాన్ని పురస్కరించుకొని శ్రీచైతన్య టెక్నో పాఠశాల మొదటిశాఖలో శాంతి స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞలు నిర్వహించారు. ఈ సందర్బంగా నెహ్రూ యువకేంద్ర సౌజన్యంతో గ్రామజ్యోతి సొసైటి ఆధ్వర్యంలో సుభద్ర పాల్గొని మాట్లాడుతూ స్మార్ట్ లివింగ్ కార్యక్రమానికి అనుసంధానంగా స్వచ్ఛాభారత్ గురించి విద్యార్థులకు వివరించారు. ఏజిఎం సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రంగా ఉండడమే కాకుండా పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యవంతమైన జీవనాన్ని కొనసాగించవచ్చునని తెలిపారు. ఆర్ఐ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నించాలని కోరారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో పరిసరాలు పరిశుభ్రతను శాంతిని నిత్య కృత్యంగా తీసుకోవాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఆర్ఐ శ్రీధర్, డీన్ నూరు, సిబ్బాచ్ వెంకటేష్, ఏఓ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంత్రి నారాలోకేష్ చొరవతో....

### క్షేమంగా ఇంటికి చేరిన కొవైట్ బాధితురాలు

**నిమ్మనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**



జీవనోపాధి కోసం కువైట్‌కు వెళ్ళిన మహిళకు అక్కడ అనుకోని ఇబ్బందులు ఎదురయ్యాయి. వాటిని తట్టుకుంటూ జీవనం సాగిస్తున్న చివరకు తన భర్త మరణించగా ఇంటికి వెళ్ళాలని అక్కడ ఇంటియజమానికి బ్రతిమాలిన బాదితురాలికి భర్త చివరి చూపు చూసుకునేందుకు వీలులేక బోరున విలపించిందింది. కువైట్‌లో పడుతున్న నరకయాతనను వీడియో తీసి సామాజిక మాద్యమాల్లో వీడియో ద్వారా మంత్రి లోకేష్ దృష్టికి చేరేలా ప్రయత్నించింది. కువైట్‌లో మహిళ బాదలను తెలుసుకొన్న మంత్రి బాధితురాలిని ఇండియాకు రప్పించడానికి విదేశాంగ వ్యహరాలశాఖలో చర్చించి కృషి చేశారు. ఫలితంగా బాధితురాలు క్షేమంగా తమ ఇంటికి శుక్రవారం తెల్లవారుజామున చేరుకొంది. నిమ్మనపల్లె మండలం వెంగంవారిపల్లె పంచాయితీ సింగంవారిపల్లెకు చెందిన రెడ్డిబాష బార్య మయాన్‌బీ తన భర్త అనారోగ్యంతో భాదపడుతున్న భర్త ఇటీవల మృతి చెందాడని తెలుసుకొన్న ఆమె కువైట్‌లోని తన యజమానికి తెలిపి మీడియా ద్వారా లోకేష్‌కు తెలిసింది. బాదితురాలి ఇంటికి రప్పించిన లోకేష్‌కు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు. కువైట్ బాధితురాలు ఇంటికి చేరుకొన్న విషయం తెలుసుకొన్న జనసేన నాయకులు మండల జనసేన ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ బాదితురాలికి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. వీరి వెంట జనసేన నాయకులు రమణ, శివ, పాల్గొన్నారు. ఈమెకు ప్రభుత్వ పరంగా ప్రత్యేక ఆర్థికసాయం కోసం కృషి చేస్తామన్నారు.

## తవళం మార్గంలో రెండు ఆర్టీసి బస్సులు

**నిమ్మనపల్లె, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**




మండలంలోని తవళం మార్గంలో రెండు బస్సులను రోజుకు పది సింగల్స్‌తో మదనపల్లె రెండవ డిపో వారు నడపడంపై ఈ మార్గంలోని ప్రయాణీకులు, విద్యార్తిని, విద్యార్థులు హర్షం తెలిపారు. ఈ రెండు బస్సులు రోజుకు మదనపల్లెలో ఉదయం 6, 8, మద్యాహ్నం 2.45, సాయంత్రం 5గంటలకు, రాత్రి 9గంటలకు బయలుదేరుతండగా తవళం మీదుగా నిమ్మనపల్లెకు చేరుకొంటాయి. అదే విధంగా నిమ్మనపల్లె నుంచి ప్రతిరోజూ ఉదయం 5, 7,15, 9, మద్యాహ్నం 3.45, సాయంత్రం 6.15లకు బయలుదేరి మదనపల్లెకు చేరుతాయన్నారు.

## ముదివేడులో తండ్రి కొడుకులపై దాడి

**కురబలకోట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :**

కబ్జాను అడ్డుకొన్న తండ్రి కొడుకులపై దాడిచేసిన ఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మండలంలోని ముదివేడుకు చెందిన ఇంతియాజ్, కుమారుడు సల్మాన్‌ఖాన్‌లు ఇంటిస్థలాన్ని పక్కంటికి చెందిన ఏజార్జ్ అక్రమంగా కబ్జా చేశాడు. దీనిని అడ్డుకోబోయిన తండ్రి, కుమారులపై దాడిచేసి గాయపరిచాడు. బాధితులు మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఈ ఘటనపై ముదివేడు పోలీసులు విచారిస్తున్నారు.

## తిరుమల లడ్డూలో కల్తీ ఉందని చెప్పడం బాధాకరం

**జమ్మలమడుగు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:**



ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి పవిత్ర ప్రసాదమైన తిరుమల లడ్డులో కల్తీ జరిగిందని చెప్పడం చాలా బాధాకరమైన విషయమని జమ్మలమడుగు ఎమ్మెల్సీ పొన్నపు రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రామసుబ్బారెడ్డి కార్యాలయంలో తిరుమల లడ్డుపై రాజకీయ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన తిరుమల లడ్డులో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, వెజిటబుల్ నూనెలు కలిపి తయారు చేస్తున్నారని చెప్పడం వల్ల ప్రపపంచంలో ఉండే వేంకటేశ్వరస్వామి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒకటికి రెండు సార్లు తిరుమల లడ్డు తయారీకి వచ్చే నెయ్యిని పరీక్షిఆంచిన తరువాతే లడ్డు తయారీ కేంద్రానికి తరలిస్తారని ఇలాంటి పటిష్ట వ్యవస్థ కలిగిన తిరుమల లడ్డు తయారీపై కల్తీ జరిగిందని ఈనాడు, ఆంధ్రజ్యోతి వంటి పత్రికల్లో వార్తలు రావడం హేయకరమైన చర్య అన్నారు. రాష్ట్ర సీఎం, 40 ఏళ్ల రాజకీయ అనుభవజ్ఞుడైన చంద్రబాబునాయుడు తిరుమల లడ్డు కల్తీ జరిగిందని చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికైనా నిజానిజాలు పరిశీలించి పవిత్ర తిరుమల లడ్డుపై చేసిన వ్యాఖ్యలు పరిశీలించుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కారు, ద్విచక్రవాహనం ఢీ - స్కూటరిస్టుకు గాయాలు

**గాలివీడు, సెప్టెంబర్ 21(ప్రభాతవార్త):**



ఎగువగొట్టివీడు మలుపు వద్ద కారు ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో స్కూటరిస్టు ఎన్‌ఎం ఆదిల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళ్లితే.. స్థానికుల కథనం మేరకు శనివారం గాలివీడు మండలం వెలిగల్లు వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఎన్‌ఎం ఆదిల్ ద్విచక్రవాహనంపై గాలివీడు నుంచి రాయచోటికి వెళ్తుండగా మార్గమధ్యంలో గొట్టివీడు మలుపు వద్ద రాయచోటి నుండి గాలివీడుకు వస్తున్న కారు పరస్పరం ఢీకొట్టుకోవడంతో ఆదిల్ కుడికాలుకు తీ వ్ర గాయమైంది. స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## ఈ నెల 24న గోపనపల్లెలో మంత్రి ప్రజాదర్బార్

**గాలివీడు, సెప్టెంబర్ 21(ప్రభాతవార్త):**

మండలంలోని గోపనపల్లె గ్రామంలో ఈ నెల 24వ తేదీన మంగళవారం రాష్ట్ర యువజన రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదే రోజు గోపనపల్లె సచివాలయం ప్రాంగణంలో ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యలపై మంత్రి వినతులను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

## పెండింగ్‌లో వేతనాలు చెల్లింపులో ఈఓ కషికి అభినందనలు

**పీలేరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్తః**



పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలని ఇప్పించాలని గతంలో సీపీఐ, ఏఐటీయూసీ ఆద్వర్యంలో పంచాయతీ ఈఓను కలిశామని, కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడానికి కషిచేసిన ఈఓ గురుమోహన్‌ను టీఎల్ వెంకటేష్ శనివారం అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పంచాయతీ అధికారులు కార్మికులకు ఈపీఎఫ్, ఈయస్ఐ ప్రతినెల చెల్లించడకుండా కార్మికులకు అన్యాయం చేశారని దానితోపాటు అధికారులు పదవులు ఉన్న నాయకులు సొంత పనులకు ఉపయోగించుకున్న వారిని కూడా పంచాయతీ కార్మికులుగా రికార్డులలో చూపించి జీతాలు ఇవ్వడం జరిగిందని ఆనిధులను రికవరీ చేసి పంచాయతీ అభివద్ధికి ఉపయోగించాలన్నారు. గత 8 నెలల పెండింగ్‌లో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ తక్షణమే చెల్లించాలని కోరారు.

## ఇది మంచి ప్రభుత్వ పేరుతో వంద రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా కరపత్రాలు విడుదల

**పీలేరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్తః**



సంక్షోభంలోను సంక్షేమం, అభివద్దిని అందించి ప్రజా సమస్యలే పరమావధిగా వంద రోజులు పాలన పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు మేరకు అంచెలంచెల వారిగీ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డితో పాటు అధికారులు, కూటమి సభ్యులు మహిళలు ఇది మంచి ప్రభుత్వం పేరుతో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వ, తాతలకు పెన్షన్ రూ.4వేలు అందించడం, దివ్యాంగులకు రూ.6వేలు ఇవ్వడం, నిరుద్యోగ యువత కు మెగా డీఎస్సీ పై సంతకం చేయడం, అనుకోకుండా వచ్చిన వరదలు విజయవాడలో ముంచెత్తడంతో చంద్రబాబునాయుడు ఆప్తుదుల నిలిచి సహాయ సహకారాలు అందించి విజయం సాధించారని బాధితులను గట్టున వేశారని కొనియాడారు. తీవ్ర విపత్కర పరిస్థితుల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో సఫలీకతమైయ్యారని మునిగిన ఇంటికి రూ.25వేలు తక్షణ సాయం అందించి వరదబాధితులకు సీఎం చంద్రబాబు నాయుడు ఆపద్బాంధవుడులా నిలిచారని కొనియాడారు. నెలనెల 1వ తేదీ ఉద్యోగులకు వేతనాలు జమ చేయడం, అమ్మలాగా లక్షల మందికి అన్నా క్యాంటీన్ ద్వారా ఆకలి తీర్చడం, ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుచేయడం, దౌర్జన్యాలు అరాచకాలకు నిలువరించి శాంతి భద్రతలపరిరక్షణ, గంజాయి, రహిత సమాజ స్థాపన, భూ ఆక్రమణలకు అడ్డుకట్ట వేసి శాంతి భద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. అనవసరంగా ఎప్పుడు లేనివిధంగా నాపై, మా కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేశారని దీనిమీద చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్నతాధికారులు ప్రజా సమస్యలపై దష్టి సారించి శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు, నాయకులు,కార్యకర్తలు మహిళలు అనుబంధ సంఘాలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సీఎం సహాయనిధికి పీలేరు ఐఎంఏ రూ.87, 500 వితరణ

**పీలేరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్తః**



వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పీలేరు శాఖ రూ. 87,500 వితరణ చేసింది. పీలేరు ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ పి.చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ వై.పవన్‌కుమార్, కోశాధికారి డాక్టర్ బి.ఈశ్వరసురేంద్ర శనివారం పీలేరుకు వచ్చిన శాసన సభ్యులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని కలిసి చెక్కు అందజేశారు.

## స్కానింగ్ సెంటర్ అవకతవకలపై విచారణ జరిపించాలి

**పీలేరు, సెప్టెంబరు 21 ప్రభాతవార్తః**

పట్టణంలోని క్లారిటీ స్కానింగ్ సెంటర్‌లో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని మంగళవారం నాడు సీపీఐ ఆధ్వర్యంలో పీలేరు క్లారిటీ స్కానింగ్ సెంటర్ ముందర నిరసన కార్యక్రమం జరుగుతుందని దీనికి సీపీఐ పార్టీ అనుబంధ సంఘాలు, పార్టీ కార్యకర్తలు అందరూ పాల్గొనాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టీఎల్ వెంకటేష్ కోరారు.

## పులివెందుల కళాశాల సీట్లు విషయమై రాష్ట్రష ప్రభుత్వం ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి

**జమ్మలమడుగు, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యా ప్రైవేటీకరణ చేయడం కోసం ప్రయత్నాన్ని మానుకోవాలని, పులివెందుల కళాశాల సీట్లు విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఎంసీకి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని జమ్మలమడుగు పట్టణ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గండి సునీల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన ప్రభుత్వం విద్య వ్యాపారీకరణకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా విద్యలో అత్యున్నతమైనటువంటి వైద్య విద్యను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎంబీబీఎస్ కళాశాలల్లో నిర్మాణంలో ఉన్నాయి. అందులో 2024-25 విద్యా సంవత్సరం కోసం పులివెందుల, ఆదోని, మార్కాపురం కోసం పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లి, పాడేరు ప్రాంతాల్లో నూతన ఎంబీబీఎస్ కళాశాలలో పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగింది. ఎన్ఎంసీ ప్రతి కళాశాలలో నిర్మాణం జరిగింది. ఎన్ఎంసీ ప్రతి కళాశాలలో 150 మంది విద్యార్థులు సీట్లు కేటాయించి ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించుకోవడం కోసం అనుమతి కూడా జారీ చేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం పాడేరులో ఉన్నటువంటి మెడికల్ కళాశాలలో కేవలం 50 సీట్లు మాత్రమే అనుమతి స్వీకరించి మిగిలిన 700 ఎంబీబీఎస్ సీట్లు మేము నిర్వహించలమేమని లేఖ రాయడం చాలా దౌర్భాగ్యమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు రద్దు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత నేరుగా ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నీట్‌కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులను వారి తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇసాక్, దస్తగిరి, రాజ్‌కుమార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ చెట్లను నాటి సంరక్షించాలి



చెన్నూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త

మండలంలోని ఉప్పరపల్లె గ్రామ పంచాయతీలోని సచివాలయం నందు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా చెట్లను నాటారు. చెట్లను రక్షిస్తేనే మనకు భవిష్యత్తు ఉంటుందని, ప్రతి ఒక్కరూ కూడా చెట్లను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే మనం ఆరోగ్యంగా ఉండగలమని, మన ఇల్లు, మన వీధి, మన పల్లె ఇలా అనుకుని ప్రతి ఒక్కరూ కూడా బాధ్యత తీసుకుని పరిశుభ్రంగా ఉంచుకుంటే దేశం అంతా కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. అలాగే గ్రామంలో సేకరించే చెత్తతో వర్మి కంపోస్టు తయారు చేసి ఉపాధి కూడా పొందవచ్చునన్నారు. కెసి కాలువ ద్వారా మండలంలోని 9వేలకు పైగా పొలాలకు నీరు అందిస్తున్నామని, చెరువులని కూడా నింపుతున్నామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల నుండి వినతి పత్రాలు స్వీకరించి అధికారులతో మాట్లాడి అప్పటికప్పుడే వాటికి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సంక్షోభంలో ఉన్నా కూడా ఒక వైపు అభివృద్ధి మరియు సంక్షేమాన్ని రెండు కళ్లలాగా చూస్తూ ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. కమలాపురం నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రీ కారిడార్ అభివృద్ధికి చంద్రబాబు సహకారంతో సెంట్రల్ గవర్నమెంట్ రూ.2వేల కోట్లు కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులలోనే నిరుద్యోగ యువతకు అండగా నిలబడుతూ మెగా డిఎస్సీతో 16437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం, పింఛన్లు ఒకేసారి రూ.1000 పెంచి రూ.4వేలు ఇవ్వడం ఒక్కటైతే మొదటి నెల ఒక్కొక్కరికి రూ.7వేలు చొప్పున ఒకే రోజు లక్షల మందికి ఇంటింటికి వెళ్లి రూ.4408 కోట్లు పంపిణీ చెయ్యడం దేశంలోనే తిరుగులేని చరిత్ర, ప్రతి నెల ఒక్కటో తేదినే ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం, పేదల కోసం రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రూ.5కే ఆకలి తీర్చే 175 అన్నా క్యాంటీన్లను పున:ప్రారంభించడం, ప్రజలకు నిద్ర లేకుండా చేసిన లాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించారన్నారు. విజయవాడ నగరం వరదలతో విలవిలలాడుతుంటే 10 రోజులపాటు అక్కడే ఉండి నిద్రాహారాలు మాని ప్రజలకు ఓ తండ్రి లాగా ప్రజలను కాపాడుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలువలోని జమ్మిని తొలగించండి



యర్రగుంట్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

మండలంలో నుండి పక్క నియోజకవర్గమైన కమళాపురం మండలాల్లోనికి ప్రవేశించి మైలవరం దక్షిణ కాలువలోని జమ్మిని(గడ్డిని) తొలగించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు యంవి సుబ్బారెడ్డి ఇది వరకు కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, మైలవరం దక్షిణ కాలువ ఏఈ బాబుకి కలెక్టర్ కార్యాలయం నీటి విడుదల ఆదేశాలు ఇవ్వడంతో ఆ మేరకు దక్షిణ కాలువ అధికారులు కమళాపురం చెరువుకు నీటి విడుదల చేసే విశయాన్ని గుర్తు చేస్తూ, నీరు కాలువ పూర్తితో జమ్మితో నిండి ఉందని నీరు రావడానికి ఆలస్యం అవుతుందని అందువల్ల జమ్మి(గడ్డిని) తొలగించాలని వినతిపత్రం అందజేశారు. గతంలో జమ్మూ తొలగించినప్పటి నుండి నవంబర్కి రెండు సంవత్సరాలు పూర్తవుతాయని, జమ్మి తోలగించడం జరుగుతుందని తెలిపారని కాంగ్రేస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఇల్లూరి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇది మంచి ప్రభుత్వం-ప్రజా ప్రభుత్వం



యర్రగుంట్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

యర్రగుంట్ల స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి ఆంధ్రప్రదేశ్లో అధికారంలోకి వచ్చి వంద రోజులు అయిన సంధర్బంగా స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో జమ్మలమడుగు నియోజకవర్గం జనసేన పార్టీ కోఆర్డినేటర్ దేరంగుల జగదీష్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి ప్రజలకు మంచి పరిపాలన అందిస్తుందని, నిరుద్యోగుల భవిష్యత్తు కొరకై మెగా డిఎస్సీపై సంతకం చేయడం, అవ్వా తాతలకు పెన్షన్ పెంచి 4వేల రూపాయలు, వికలాంగులకు 6000 పెన్షన్ అందజేస్తున్నామని, వీటితో పాటు దాదాపు లక్షల మంది పేద ప్రజలకు కేవలం ఐదు రూపాయలకే అన్నా క్యాంటీన్ ద్వారా ఆహారాన్ని అందిస్తున్నామని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిట్ యాక్ట్ను కూడ రద్దు చేశామని ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాన్ గారు కేవలం 100రోజుల్లోనే పంచాయతీరాజ్ శాఖకు కేంద్ర ప్రభుత్వం సహాయంతో దాదాపు రెండు వేల కోట్లను విడుదల చేయడం జరిగిందని, అలాగే 13326 గ్రామ పంచాయతీలో ఒకటే రోజు గ్రామ సభ నిర్వహించి ప్రపంచ రికార్డ్ సాధించిందని వీటితో పాటు క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాన్ని, 15.4కోట్ల రూపాయలను హరితవనాల కోసం విడుదల చేయడం జరిగిందని, ఇటీవల సంబంధించిన వరదలను కూడ కూటమి ప్రభుత్వం విజయవంతంగా ఎదుర్కొందని, కేవలం పవన్కళ్యాన్ తన సొంత నిధి నుంచి ఆరు కోట్ల రూపాయలను అందజేయడం జరిగిందని ఇందులో ఒక కోటి రూపాయలను ఆంధ్రప్రదేశ్ సీఎం రిలీఫ్ ఫండ్కి, ఇంకో కోటి తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్కు మిగతా నాలుగు కోట్ల రూపాయలను 400పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి లక్ష రూపాయలు తరపున అందజేయడం జరిగిందని ఇది మంచి ప్రభుత్వం-ప్రజా ప్రభుత్వం అని అన్నారు.

## చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు టిడిపి బిసి నాయకులు, శ్రీ కృష్ణాలయ యాదవ సేవా సమితి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు ప్రతి నెల పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం స్థానిక మైదుకూరు రోడ్డులోని అన్వర్ థియేటర్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 1000మంది పాల్గొని తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదానం చేస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్కు వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మనుషుల్లో నిలిచేలా భగవంతుడు ఆయనకు ఆశీస్సులు అందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, సీతంపల్లి రమణ ప్రసాద్, బింగి శివ, నల్లం రవిశంకర్, రామచంద్ర రాజు, యేసునాధ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీపీపీలో దొంగతనం

యర్రగుంట్ల, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:

కడప జిల్లా యర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామం నందలి ఆర్టీపీపీ ప్లాంట్లో గల వి.ఏ టెక్ కన్స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించినటువంటి స్టోర్ నుండి సుమారు 2,42,000 రూపాయలు విలువ చేసే వివిధ రకాల(సామాన్ల)ను, ఇనుప వస్తువులను ఎవరో గుర్తు తెలియని దొంగలు శుక్రవారం రాత్రి దొంగలించుకొని పోయినారని స్టోర్ ఇన్చార్జ్ వంగలి ప్రసాద్ రెడ్డి శనివారం పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలమళ్ల ఎస్ఐ ఎల్.తిమోతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడుపు పొడిగింపు

రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ఓపెన్ స్కూల్ నందు 2024-25 విద్యాసంవత్సరం ప్రవేశాల కొరకు ధరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 28వ తేది వరకు అపరాధ రుసుము లేకుండా పొడగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29, 30వ తేదిలలో 200రూపాయలు అపరాధ రుసుముతో ఆన్లైన్ చెల్లించవచ్చు అన్నారు. జిల్లా లోని డ్రాప్ ఔట్ స్టూడెంట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మన జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్లో చేరగలిగే వయసు ఉన్న 754మంది విద్యార్థుల డ్రాప్య ఔట్ చిల్డ్రన్ వివరాలు మండలము నందలి పాఠశాలల వారీగా మండల విద్యాశాఖాధికారులు వద్ద ఉన్నాయన్నారు. వారినందరిని మండలము నందలీ కోఆర్డినేటర్లు తమ తమ సెంటర్స్ నందు చేర్చుకోవడానికి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్లు ఈ విశయాన్ని విరివిగా ప్రచారం చేసి అందరూ ప్రవేశాలు పొందేలాగా ప్రయత్నించాలన్నారు.

## స్టేట్ లెవెల్ క్రీడలకు బీరం విద్యార్థులు ఎంపిక

ఖాజీపేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ఎస్.జి.ఎఫ్ ఐ ఆధ్వర్యంలో శనివారం నాడు మైదుకూరులో నిర్వహించిన జిల్లా స్థాయి త్రో బాల్ అండర్-19 క్రీడల విభాగంలో బీరం శ్రీధర్ రెడ్డి విద్యార్థులైన ఎ.దినకర్(ఇంటర్ ఫస్ట్ ఇయర్), సి.గంగిరెడ్డి(ఇంటర్ ఫస్ట్ ఇయర్), కె.శ్రీకాంత్(పదవ తరగతి), మరియు వాలీబాల్ అండర్-19 విభాగంలో ఆర్.జె మధు హాసిని(పదవ తరగతి), బి.ప్రమోద్ (ఇంటర్ ఫస్ట్ ఇయర్) విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడల్లో పాల్గొని స్టేట్ లెవెల్ క్రీడలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బీరం విద్యా సంస్థల అధినేత బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ విజయాని కన్నా దాని కోసం చేసే ప్రయత్నం గొప్పది అని బీరం విద్యార్థులు నిరూపించారని, బీరం విద్యార్థులు స్టేట్ లెవెల్లో కూడ గెలిచి జాతీయ స్థాయి క్రీడలకు ఎంపిక కావాలని ఆయన తన హర్షాన్ని తెలియజేశారు. గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీరం విద్యాసంస్థల డైరెక్టర్ స్వాతి, శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపల్ శ్వేత, కళాశాల ప్రిన్సిపల్ హేమ్ చందర్, పిఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాజంపేటలో ఘనంగా గురజాడ జయంతి వేడుకలు

రాజంపేట అర్బన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



నాటి సమాజంలో వేళ్ళూనుకున్న దురాచారాలపై సాహిత్యం ద్వారా ప్రజలలో చైతన్యం కలిగించిన మహాకవి, సంఘసంస్కర్త గురజాడ వెంకట అప్పారావు అని తెలుగు భాషా సంరక్షణ సమితి నాయకులు కొనిఆడారు. గురజాడ 162వ జయంతి సంధర్భంగా స్థానిక జౌళి బజారులోని శనివారం సరస్వతి విద్యా మందిరంలో వారి చిత్ర పటానికి సమితి నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా సమితి ప్రతినిధులు గంగనపల్లి వెంకటరమణ, బొట్టా రామచంద్రయ్య నాయుడు, జీ.వి నారాయణరాజులు మాట్లాడుతూ ప్రజలందరికి అర్ధమయ్యే జీవ భాషలో రచనలు చేసి వ్యవహారిక భాషకు వన్నె తెచ్చిన మహానుభావుడు గురజాడ అని వారు పేర్కొన్నారు. అభ్యుదయ కవితా పితామహుడుగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకున్న గురజాడ ఆధునిక భాషలో నూతన ఒరవడినిసృష్టించి కవి శేఖర బిరుదును పొందిన ఘనాపాటి అని వారు శ్లాఘించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ వేత్తల లో గురజాడ ఒకరని, ఈ నాటికి ఆయన రచనలు ప్రజల మన్ననలను పొందుతున్నాయని, ఆయన రచనలు రాశిలో తక్కువైన వాసికెక్కనవని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యామందిరం పాఠశాల ఉపాధ్యాయునులు పుష్పలత, శ్రావణీ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## వరద బాధిత విద్యార్థులకు రాజుకుంట యువత సహాయం

చిట్వేలి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



వరదలతో సర్వం కోల్పోయిన విజయవాడ వరద బాధిత గ్రామాల్లో విద్యార్థులకు తమ వంతుగా సహాయం అందించారు. విజయవాడ వాంబే కాలనీలోని జేడీఎంఎంసీ ప్రాథమిక పాఠశాలలో మండల విద్యా శాఖ అధికారి వెంకట్వేరరావు ఆధ్వర్యంలో 450 మంది పిల్లలకు రూ.65వేలు విలువ చేసే 3300 నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందించారు. అదే ప్రాంగణంలోని అంగన్వాడీ సెంటర్కు అలాగే నిర్మలా శిశు భవన్ వికలాంగుల ఆశ్రమానికి చెరో 5000 విలువ చేసే వస్తువులను వితరణగా ఇచ్చారు. సంబంధిత పాఠశాలల యాజమాన్యం రాజుగుంట గ్రామ యువతకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాజుకుంట గ్రామ యువత నానబాల సురేంద్ర, పవన్, సాయి కిరణ్, నరేష్, దిలీప్, స్నేహితులు, సంబంధిత పాఠశాలల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై ర్యాలీ, మానవహారం

చిట్వేలి, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:



స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల పరిధిలోని చెర్లోపల్లె గ్రామంలో పారిశుద్ధ్యంపై అవగాహన ర్యాలీ, మానవహారాన్ని నిర్వహించారు. సీడీపీవో రాజేశ్వరి మాట్లాడుతూ పరిశుభ్రతతో పలు వ్యాధులకు దూరంగా ఉంవచ్చన్నారు. మన ఇంటి నుంచే శుభ్రతకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. సరైన ఆహారంతోనే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చన్నారు. సంతులిత ఆహార నియమాలతో గర్భిణీ పరిపుష్టి గల బిడ్డకు జన్మనివ్వగలదని సూచించారు. బిడ్డ మొదటి నెల నుంచి రెండు సంవత్సరాల పాటు సంరక్షణ అంగన్వాడీదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేశవరెడ్డి, ఉపాధ్యాయులు రామ్మోహన్రావు, టైపిస్ట్, హరీష్, అంగన్వాడీ కార్కరర్తలు రాజేశ్వరి, మాధవి, సుబ్బులక్ష్మి, శ్రీదేవి, ఆశా వర్కర్లు, గర్భవతులు, బాలింతలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూను అపవిత్రం చేస్తే సహించం

వేంపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



తిరుమల లడ్డూను అపవిత్రం చేస్తే సహించబోమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిహరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి వేంపల్లె పోలీసుస్టేషన్లో ఆయన ఫిర్యాదు చేసి ఎస్సై తిరుపాల్నాయక్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారికి ప్రీతిపాత్రమైన లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వుతో కల్తీ నెయ్యి, చేపనూనెను వినియోగించారని వస్తున్న కథనాలు హిందువుల మనోభావాలు తీవ్రంగా కలచివేస్తోందన్నారు. అలాగే గత పాలకులు శ్రీవారి పవిత్రతను దెబ్బతీయడంతో పాటు అన్యమత ప్రచారాన్ని ఒడిగట్టారన్నారు. శేషాచలం కొండల్లోని ఎర్రచందనం కొల్లగొట్టి, ఏడు కొండలను రెండు కొండలు చేశారని ఆరోపించారు. అన్యమతస్థులకు ఉద్యోగాల్లో అవకాశాలు కల్పించడం ద్వారానే ఇలాంటి కుట్రలకు ఆస్కారం ఏర్పడిందన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, సుష్మా, దొంతుసుమన్, చంద్ర, జనసేన నాయకులు డాక్టర్ నందకిషోర్, మల్లికార్జున, దేవా, తదితరులు పాల్గొన్నారు.

– కల్తీ నెయ్యిపై సమగ్ర విచారణ జరపాలి : తిరుమల లడ్డూలో కలుపుతున్న కల్తీ నెయ్యిపైన సమగ్ర విచారణ జరిపి ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పివిఎన్వి ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ఎంతో పవిత్రమైందన్నారు. ప్రపంచంలోనే కొన్ని కోట్ల ప్రజల ఆరాధ్యదైవం తిరుమల వెంకటేశ్వరస్వామి అని, అలాంటి స్వామికి ప్రీతికరమైన లడ్డూలో కల్తీ నెయ్యి వాడడం చాలా దారుణం అన్నారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడినట్లు బహిర్గతం చేయడం ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అని ఆయన అన్నారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ప్రమేయం ఉన్న వ్యక్తులను కూడా వదలకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో మురళీధర్రావు, సుధాకర్శర్మ, ప్రసాదశర్మ, శేషగిరిరావు, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో మంచి విజయాలను సొంతం చేసుకోవాలి

వేంపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :



క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో పాల్గొని మంచి విజయాలను సొంతం చేసుకోవాలని వేంపల్లె గ్రామ పంచాయతీ సర్పంచి ఆర్.శ్రీనివాసులు ఆకాంక్షించారు. శనివారం వేంపల్లె జడ్పీ క్రీడామైదానంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి హ్యాండ్బాల్ సబ్ జూనియర్ పోటీలకు విశిష్ట అతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం క్రీడాకారులతో కరచాలనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలన్నారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని, దీంతో ప్రశాంత వాతావరణం నెలకొల్పవచ్చన్నారు. ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభను చాటి చెప్పి, తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి గుర్తింపు తేవాలన్నారు. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శివమునెమ్మ, ఫిజికల్ డైరెక్టరు రాజశేఖర్, ఉపాధ్యాయులు జయప్రదం, సంగమేశ్వర్రెడ్డి, జనార్ధన్రెడ్డి, ధర్మారెడ్డి, చంద్రమోహన్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్బాల్లో కడపకు డబుల్క్రౌన్

వేంపల్లె, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :

వేంపల్లెలోని తలిశెట్టి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్బాల్ బాల, బాలికల విభాగంలో మొదటిస్థానాన్ని సంపాదించి కడప జట్టు డబల్క్రౌన్ సాధించింది. విజేతలకు రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ట్రోఫీలతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. బాలుర విభాగంలో కడప, సత్యసాయి జిల్లా జట్లు వరుసగా ప్రథమ, ద్వితీయస్థానాలు సంపాదించాయి. కర్నూలు, చిత్తూరు జట్లు తృతీయ సంయుక్త స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో కడప జట్టు, గుంటూరు జట్లు ప్రథమ, ద్వితీయస్థానాల్లో గెలుపొందాయి. మూడో స్థానంలో కర్నూలు బాలికల జట్టు నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేంపల్లె జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్రెడ్డి, ఏపీ హ్యాండ్బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కడప జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఛాంపియన్షిప్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టీచర్స్ యూనియన్ నాయకులు సంగమేశ్వర్రెడ్డి, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి రామాంజనేయులు, వివిధ జిల్లాల హ్యాండ్బాల్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, దాతలు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.




## శ్రీవారి ఆలయానికి బీరువా, హుండీ వితరణ

గాలివీడు, సెప్టెంబర్ 21(ప్రభాతవార్త):



మండల కేంద్రం పెద్దూరు బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి కేడెం వీరారెడ్డి, మంత్రి రెడ్డికళ వారి తల్లిదండ్రులు కే.శే.వెంకటలక్ష్మి, ఆదినారాయణ జ్ఞాపకార్థం 100 కేజీల బరువు కలిగిన బీరువాను వితరణగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అదే విధంగా కమిటీ సభ్యుల సహకారంతో హుండీని కూడా ఆలయంలో ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయంలో అవసరమైన వస్తువులను ఎప్పటికప్పుడు దాతల సహకారంతో ఏర్పాటు చేసుకోవడం హర్షదాయకమన్నారు. అలాగే ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి ఆర్థికంగా సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హరిక్రిష్ణ, వీరారెడ్డి, రేవనూరి రాజ్కుమార్, రాజేష్, ఆదినారాయణ, రమేష్, రామాంజులు, రమేష్ పాల్గొన్నారు.

## ఆరోగ్య ఉపకేంద్రం ఆకస్మిక తనిఖీ

గాలివీడు, సెప్టెంబర్ 21(ప్రభాతవార్త):



మండల కేంద్రం గాలివీడు-1 పరిధిలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్యశాఖ టాస్క్ఫోర్స్ సభ్యులు జిల్లా స్టాటిస్టికల్ అధికారి ఓబుల్రెడ్డి, డీపీఓ మునీశ్వర్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలకు ఆరోగ్య ఉపకేంద్రంలో అందిస్తున్న సేవలు, వాటిని ఏఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. గర్భిణీలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, వారు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి తెలియజేశారు. అనంతరం స్థానిక ఉర్దూ పాఠశాలలో 30 మంది బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, పీహెచ్ఎన్ సాలమ్మ, ఎంఎల్పీహెచ్ షాహీనా, ఏఎన్ఎం సుశీల, ఆశా కార్యకర్తలు సుప్రజ, పరమేశ్వరి, సుల్తాన్బీ తదితరులు పాల్గొన్నారు.

## ఆటల పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

పెనగలూరు ,సెప్టంబర్21,ప్రభాత వార్త :



మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటున్న విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే క్రీడలలో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు.వాలీబాల్ నందు జూనియర్ ఇంటర్ యంపిసి వనిత, బాల్ బ్యాడ్మెంటన్ నందు జూనియర్ ఇంటర్ సిఈసి జి.రమ్యలు రాష్ట్రస్థాయి క్రీడలకు అర్హత సాధించారని తెలిపారు. అలాగే సీనియర్ ఇంటర్ నుండి టేబుల్ టెన్నీస్ నందు ఎంపీసీ విద్యార్థులు ఇందు వర్షిత, శివాని, ఈశ్వర్ చంద్ర, సుమంత్, చరణ్యలు ఎంకికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రముంలో అధ్యాపకులు మోహుద్దీన్, షకీలా బేగం, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

## కెఓఆర్యంలో కర్తదాన శిభిరం

కడప,సెప్టంబర్21,ప్రభాత వార్త :




కడప నగరంలోని కెఓఆర్యం ఇంజనీరింగ్ కళాశాల నందు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు హెచ్డీయఫ్సి వారి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిభిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో డిప్లొమా ఇంజనీరింగ్ మరియు ఎంబీఏ చదువుతున్న 47 మంది విధ్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ నుండి డి శివశంకర్ రెడ్డి డా.యశస్వి రెడ్డి, మరియు హెడీఎఫ్సి నుండి రమేష్ లు మాట్లాగుతూ కార్యక్రమాన్ని ఇక్కడ నిర్వహించడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. కళాశాల కరస్పాండెంట్ లిఖిత రెడ్డి మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం మా కళాశాల ఎల్లవేళలా ముందు ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంమలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, విభాగాధిపతులు, కళాశాల సిబ్బంది మరియు విధ్యార్థులు పాల్గొన్నారు.

## అరబ్ద్ ఉత్సవం ...నూతన ఉత్సాహం

కడప,సెప్టంబర్21,ప్రభాతవార్త :



నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ కెయస్ఆర్యం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగన అరబ్ద్ ఉత్సవం అత్యంత ఆధ్యంతం కేరింతలతో సాగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మూర్తి మాట్లాడుతూ ఉన్నత లక్ష్యలను సాధించే క్రమంలో విద్యార్థులు మానసికంగా సిద్దం కావాలని కోరారు. ట్రైనింగ్ ప్లేస్మెంట్ ఇన్చార్జి నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగ పోటీ మనిషికి వేదస్సుతో ఎలాంటి మార్పు ఉండబోతుంతో అని విద్యార్థులకు వివరించారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల రెడ్డి (నాని) మాట్లాడుతూ ఉన్నత లక్షాలను సాధించడానికి కావలసిన అన్నీ వసతులను కల్పిస్తూ పోటీ ప్రపంచాన్ని గెలిచే సత్తా మరియు వనరుల వినియోగించుకొని ఉన్నత స్థానాలలో ఉండాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరి విద్యార్థులందరినీ అభినందించారు. ఈ సందర్భంగా కళా శాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంమలో అడ్మినీస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, వివిధ విభాగాధిపతులు కళాశాల కల్చేలర్ క్లబ్ ఇన్చార్జి వీర శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్య వంతులుగా ఉండాలంటే క్రీడలు బాగా ఆడాలి

ముద్దనూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



ఆరోగ్య వంతులుగా ఉండాలంటే అందరూ ఆటలు ఆడాలని ముద్దనూరు మండల విద్యాశాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. ముద్దనూరు మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పోటీలకు ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి సుబ్బారావు మాట్లాడుతూ శారీరకంగా మానసికంగా ధృడంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఆటలు ఆడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముద్దనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ దస్తగిరి కబాడి క్రీడా పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ జిల్లాకు మంచి పేరు తేవాలని అలాగే ముద్దనూరు మండల క్రీడాకారులు క్రీడారంగంలో మంచి ప్రతిభ చూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు మాట్లాడుతూ శారీరక ధృడత్వం కోసం విద్యార్థి దశ నుండే క్రీడల్లో పాల్గొంటే దేశం ఆరోగ్యకరమైన యువతను అందించేవారు అవుతారని తెలిపారు. మండలంలోని క్రీడాకారులు దాదాపు 200మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అథ్లెటిక్ పోటీ ఈ కార్యక్రమంలో మండల వ్యాయామ ఉపాధ్యాయ కోఆర్డినేటర్ మాధవరెడ్డి, పీడీలు ఇజ్రాయిల్, దేవికా పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు 100టీషర్ట్లు, 100పాయింట్లు పంపిణీ

ముద్దనూరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:



భూమా మెడికల్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని కోడిగాల్ల పల్లె సమీపంలో ఉన్న మానసిక వికలాంగ యేసు కరుణాలయంలో శనివారం నాడు పట్టణంలోని భూమి మెడికల్ స్టోర్ ఆధ్వర్యంలో భూమా భద్రరెడ్డి ఎవరూ లేని మానసిక వికలాంగులకు 100జతలు బట్టలు పంపిణీ చేశారు. అనంతరం అనాథలకు బ్రెడ్లు, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లను మానసిక వికలాంగులకు అందజేశారు. అనాధాశ్రమ నిర్వాహకులు పాస్టర్ ఇమ్మానియల్ నిరాశ్రయులకు వంట నూనె లేదని తెలపడంతో కావలసిన వంట నూనెను మంచి మనసుతో భూమా భద్రారెడ్డి ఏర్పాటుచేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఎవరైనా మంచి మనసుతో ఇలాంటి ఎవరు లేని అనాథ మానసిక వికలాంగులకు వారికి తోచిన సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి నరసయ్య, మోహన్, నాగయ్యలు పాల్గొన్నారు.